'పొలం బాట'తో రైతుల భద్రత

● సత్వరమే విద్యుత్ సమస్యల పరిష్కారం

నెక్కొండ : ప్రభుత్వం రాష్ట్ర విద్యుత్ శాఖ ద్వారా చేపట్టిన 'పొలం బాట' కార్యక్రమం రైతుల భద్రతకు బాటలు వేస్తోంది. ఆ శాఖ అధికారులు పొలాల వద్ద రైతులను కలిసి సూచనలు అందిస్తున్నారు. విద్యుత్ సరఫరాలో ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూనే నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నారు.

కార్యక్రమ లక్ష్యాలు..

వ్యవసాయ క్షేత్రాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, లైట్లు, మోటార్లలోని సమస్యలను గుర్తించి అక్కడికక్కడే పరిష్కరించడంతోపాటు నాణ్యమైన విద్యుత్ అందించడం. అలాగే విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారు. అధికారులకు, రైతులకు మధ్య సమన్వయం కల్పిస్తారు.

అమలు తీరు..

పొలం బాట కార్యక్రమంలో భాగంగా అధికారులు, సిబ్బంది పొలాల వద్దకు వెళ్లి మోటార్లు, సర్వీస్ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల పని తీరును పరిశీలించి లూజుగా ఉన్న తీగలను, విరిగిన స్తంభాలను సరిచేస్తున్నారు. తక్షణ పరిష్కారానికి సాధ్యం కాని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. రైతులతో మాట్లాడి సమస్యలను గుర్తించడంతోపాటు పరిష్కారానికి సూచనలు ఇస్తున్నారు. మోటార్ల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నారు. కొత్తగా ఉపకేంద్రాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీడర్ లైన్లు ఏర్పాటు చేస్తున్నారు.



రైతులకు జాగ్రత్తలు వివరిస్తున్న అధికారులు, సిబ్బంది (ఫైల్)

జాగ్రత్తలు చెబుతున్నారు



పొలం బాట కార్యక్రమం ఉపయోగపడుతోంది. గతంలో మోటార్లు కాలిపోతే, విద్యుత్ అంతరాయం ఏర్పడితే కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేది. అధికారులు, సిబ్బంది వ్యవసాయ క్షేత్రాల వద్దకు వచ్చి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నారు. రైతులకు అవగాహన కల్పిస్తూ ప్రమాదాల నివారణకు చొరవ తీసుకుంటున్నారు.

- తమ్మిశెట్టి కోటేశ్వర్, రైతు, చంద్రుగొండ

విద్యుత్ ప్రమాదాలు తగ్గాయి



విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాము. సమస్యలను పరిష్కరిస్తున్నాము. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందుతోంది. పంట పొలాల వద్ద విద్యుత్ ప్రమాదాలు తగ్గాయి. రైతులు ఆనందం వ్యక్తం చేస్తుండగా అధికారులకు, సిబ్బందికి పొలం బాట కార్యక్రమం సంతృప్తినిస్తోంది.

- శ్రీధర్, ఏడీఈ, నెక్కొండ

బీసీ రిజర్వేషన్ల పేరుతో డ్రామా

● మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



నర్సంపేట : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల తరహాలోనే 42 శాతం బీసీ రిజర్వేషన్ల పేరుతో డ్రామా ఆడుతోందని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో 55 ఏళ్లపాటు అధికారంలో ఉన్నా ఏనాడైనా బీసీ రిజర్వేషన్ల కోసం ప్రయత్నించిందా? అని ప్రశ్నించారు. చిత్తశుద్ధి ఉంటే జాతీయ నాయకులతో ఢిల్లీ వేదికగా ఉద్యమిస్తే కలిసి రావడానికి బీఆర్ఎస్ సిద్ధంగా ఉంటుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందాలని చేసిన కుట్రలు పటాపంచలయ్యాయని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధించే చిత్తశుద్ధి సీఎం రేవంత్‌రెడ్డికి లేదన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు చట్టబద్ధత కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సి ఉంగా పక్కదోవ పట్టించారని ఆరోపించారు. నామమాత్రంగా జీఓ ఇచ్చి కొత్త నాటకానికి తెర తీసి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ఇకనైనా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి పార్లమెంటులో చట్టం చేయించి షెడ్యూల్ 9లో చేర్చాలని హితవు పలికారు.

కుటుంబ వ్యవస్థ బలోపేతమే లక్ష్యం

● సర్వోదయ సంస్థ కార్యదర్శి దామోదర్

గీసుకొండ : కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ పని చేస్తోందని కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ తెలిపారు. లింగ ఆధారిత హింస నివారణ, మహిళల రక్షణ చట్టాలపై మండలంలోని గంగదేవిపల్లిలోని శిక్షణ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నా లింగ వివక్ష, హింస కొనసాగుతుండడం బాధాకరమన్నారు. సుమారు 15 ఏళ్లుగా మహిళల రక్షణ కోసం సహాయ కేంద్రాల ఆధ్వర్యంలో కృషి చేస్తున్నామని తెలిపారు. వరంగల్, హన్మకొండ జిల్లాల్లో సఖి వన్‌స్టాప్ సెంటర్లు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఐసీడీఎస్ వర్ధన్నపేట ప్రాజెక్టు సీడీపీఓ డెబోరా మాట్లాడుతూ పోషణ మాసంలో భాగంగా గర్భిణులకు శ్రీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన, సామూహిక అక్షరాభ్యాసం తదితర కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. సమస్యలు ఎదురైతే మహిళలు డయల్ 100, 181 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. ప్రముఖ న్యాయవాది రవికుమార్ మాట్లాడుతూ మహిళలు రక్షణ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ ప్రతినిధులు కవిరాజ్, అక్తర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రేవతి, చంద్రకళ, ఈశ్వరి, మాధవి, శ్రీనివాస్, రాజు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్

మల్టీపర్పస్ కార్మికుడిపై దాడి సరికాదు



పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిరసన తెలుపుతున్న కార్మికులు

ఖానాపురం : గ్రామ పంచాయతీ కార్మికుడిపై దాడి సరికాదని జీపీ మల్టీపర్పస్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు ఉస్మాన్ పాషా అన్నారు. బోటిమీదితండా గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ భిక్షపతిపై దాడి చేసిన భానుప్రసాద్‌పై యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో, ఎంపీడీఓ సునీల్‌కుమార్‌కు గురువారం వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. అలాగే నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉస్మాన్ పాషా మాట్లాడారు. పంచాయతీ కార్మికుడిపై దాడి చేసిన వ్యక్తిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కుమారస్వామి, రాజు, శంకర్, మోహన్, కనకయ్య, అనిల్, సాంబయ్య, వీరన్న, నర్సయ్య, వెంకటమ్మ, శైలజ, యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

ఆత్మకూరు : బీజేపీ కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేసి రానున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు బీజేపీలో చేరగా ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడారు. కార్యకర్తలు క్రియాశీలకంగా ప్రచారం చేయాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి అధికార కాంగ్రెస్ పార్టీ చేస్తున్న తప్పిదాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు వేణుగౌడ్, మాజీ జెడ్పీటీసీ సత్యనారాయణ, నాయకులు బుచ్చిరెడ్డి, షైడి, సదానందం, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోషక పదార్థాలతో సంపూర్ణ ఆరోగ్యం

దామెర : పోషక పదార్థాలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీఓ స్వాతి తెలిపారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన పోషణమాసం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఊరుగొండలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు రక్తహీనత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. చిరుధాన్యాలలో పోషక పదార్థాలు పుష్కలంగా అభిస్తాయని అన్నారు. వ్యక్తిగత శుభ్రత పాటిస్తూ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మంజుల, ప్రత్యేక అధికారి భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యవసాయ కూలీ మృతి



పర్వతగిరి : మండలంలోని కల్లెడకు చెందిన వ్యవసాయ కూలీ బాల్నే వెంకటయ్య (40) గుండెపోటుకు గురై మృతి చెందాడు. కుటుంబ పోషణ కోసం రోజు వారీ పనిలో భాగంగా రాయపర్తి మండలంలోని కొత్తూరులో పత్తి ఏరడానికి వెళ్లిన ఆయన గురువారం మధ్యాహ్నం భోజనం అనంతరం పత్తి ఏరుతూ గుండెపోటుతో అక్కడికక్కడే ప్రాణాలొదిలాడు. వెంకటయ్య మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు ముదురుకోళ్ల రమేశ్, తదితరులు నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఇద్దరి నామినేషన్

సంగెం : సంగెం జెడ్పీటీసీ పదవికి నెక్కొండ మండలంలోని రెడ్లవాడకు చెందిన అన్నమనేని శ్రీలత, మొండ్రాయి ఎంపీటీసీ స్థానానికి స్థానికుడు పొన్నాల హరీశ్ గురువారం వేర్వేరుగా నామినేషన్ దాఖలు చేశారు. మొత్తం 38 మంది నామినేషన్ వేసేందుకు పత్రాలు తీసుకోగా హైకోర్టు స్టే ఇవ్వడంతో నిరాశకు గురయ్యారు. సంబంధిత పత్రాల కోసం మీ సేవా కేంద్రాలు, తహసీల్ కార్యాలయాల చుట్టూ తిరిగిన ఆశావహులు ఒక్కసారిగా నీరుగారి పోయినట్టు కనపడుతోంది.

సన్మానం



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని మాదన్నపేటకు చెందిన గొట్టుముక్కల సరస్వతి యోచన దంపతుల కుమార్తె వెన్నెల వర్షిణిని ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన సందర్భంగా బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పులి దేవేందర్ ఆధ్వర్యంలో గురువారం శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం దేవేందర్ మాట్లాడారు. భవిష్యత్తులో వైద్యురాలిగా ఉన్నతి స్థాయికి ఎదగాలని, సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పొన్నం రాజు, నీరటి రాజు, పెండ్యాల కృష్ణ, దండు రాజేందర్, ఎదురబోయిన సంతోశ్, దండు రమేశ్, ఎదురబోయిన సంతోశ్, బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక

దుగ్గొండి: మండలంలోని రేబల్లెలో యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా సిద్దోజు రామాచారి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డేంగు బాపురావు, ఉపాధ్యక్షుడుగా దరుగుల లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా అడ్డాల శివాజీ, కార్యదర్శిగా బాషి, కోశాధికారిగా పేరబోయిన రాజు, కార్యవర్గ సభ్యులుగా మిర్యాల రాజు, పేరబోయిన కోటి, మారెపల్లి రాజు, తిప్పారపు రాజు, జక్కుల రామకృష్ణ, వాడికారి తిరుపతి ఎన్నికయ్యారు. అనంతరం అధ్యక్షుడు రామాచారి మాట్లాడారు. యూత్ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

కటాక్షపూర్ మత్తడిరోడ్డుకు మరమ్మతులు

ఆత్మకూరు : మండలంలోని కటాక్షపూర్ మత్తడి వద్ద ప్రమాద నివారణ చర్యలు చేపట్టినట్లు సీఐ సంతోశ్ కుమార్ తెలిపారు. గురువారం మత్తడిని పరిశీలించి హైవే కాంట్రాక్టర్‌తో మత్తడిరోడ్డుకు మరమ్మత్తులు చేపట్టినట్లు చెప్పారు. మత్తడిపై నుంచి వాహనాలు నడుస్తున్నాయని, ఎలాంటి ఇబ్బంది లేదన్నారు.

సమాచార హక్కుచట్టం పౌరులకు ఆయుధం

ఆత్మకూరు : ఆర్‌టీఐ (సమాచార హక్కు చట్టం) పౌరులకు ఆయుధమని డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం సమాచార హక్కుచట్టం 20 ఏళ్లు పూర్తైన సందర్భంగా పరిరక్షణ వారోత్సవాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు, వాటి ఖర్చులు తదితర సమాచారం తెలుసుకునేందుకు చట్టం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ కార్యదర్శి నరేశ్, ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ సురేశ్, నాయకులు సదానందం, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

విలువలతోనే జీవితంలో ఉన్నతి

● ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ దామోదర్

నెక్కొండ : విలువలు పాటిస్తేనే జీవితంలో ఉన్నతి సాధించగలరని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ కజాంపురం దామోదర్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన ×సంస్కార వికాస శిక్షణ× కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువులతోపాటు సమకాలీన సామాజిక విలువలు, శాస్త్రీయ విజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. చదువుల్లో, ఆటపాటల్లో, ఇతర అవకాశం ఉన్న రంగాల్లో ప్రతిభ చాటి ఇతరులకు ఆదర్శప్రాయులుగా నిలవాలని ఆకాంక్షించారు. అసాంఘిక కార్యకలాపాల వల్ల తలెత్తే ప్రమాదాల పట్ల చైతన్యవంతం కావాలని చెప్పారు. ఉద్వేగభరిత ఆలోచనలు కలిగే విద్యార్థి దశలోనే బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకునేలా ప్రణాళికలు రచించుకోవాలని తెలిపారు. లక్ష్యాన్ని ఎంచుకుని సాధన దిశగా శ్రమించాలని కోరారు. రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య మాట్లాడుతూ విద్యార్థులు విలువలు పాటిస్తూ తల్లిదండ్రులు, గురువులు గర్వించేలా ఎదగాలన్నారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ కరుణ, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హనుమకొండ కార్యదర్శి తేరాల యుగేందర్, అధ్యాపకులు శారద, రంజిత్ కుమార్, ఆనందం, ప్రభాకర్, అశోక్‌కుమార్, సంపత్, ఉమారాణి, శ్రీలత, భీమేందర్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్

ఎన్నికలెప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలి



రాయపర్తి : నాయకులు, కార్యకర్తలతో కలిసి బాకీ కార్డులను ప్రదర్శిస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

● మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాయపర్తి : స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించుకునేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఆ పార్టీ రాష్ట్ర నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కోరారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి విస్మరించిన పథకాల వివరాలతో ముద్రించిన బాకీ కార్డులను మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి గురువారం ఆయన ప్రదర్శించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలపై విస్తృత ప్రచారం చేసి ప్రజలను చైతన్యవంతం చేయాలని సూచించారు. పార్టీ కోసం, ప్రజల కోసం పని చేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల ఎన్నికల ఇన్‌చార్జ్ గుడిపూడి గోపాల్‌రావు, మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహ నాయక్, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్లు కుందూరు రామచంద్రారెడ్డి, జక్కుల వెంకట్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, అధికార ప్రతినిధి తాళ్లపెల్లి సంతోశ్ గౌడ్, సంకినేని ఎల్లస్వామి, చందు సతీశ్ తదితరులు పాల్గొన్నారు.



ఖానాపురం: బాకీ కార్డులను అందిస్తున్న నాయకులు

కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

ఖానాపురం : కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు పైండ్ల యాదగిరి అన్నారు. మండలంలోని మంగళవారిపేటలో బాకీ కార్డులతో ప్రచారం చేయగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలును నిర్లక్ష్యం చేస్తోందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమేశ్, నాయకులు బాలు, ఉపేందర్, బాబు, మురళీ, నర్సయ్య, స్వామి, రవి, రామ్మూర్తి, రాజు, కేశవులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డుతోనే కార్మికులకు న్యాయం

● ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి ప్రదీప్

నల్లబెల్లి : ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటైన సంక్షేమ బోర్డు ద్వారానే కార్మికులకు న్యాయం జరుగుతుందని ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి ప్రదీప్ తెలిపారు. పథకాల అమలును ప్రైవేట్‌పరం చేసే దిశగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ యూనియన్ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలను మండలంలోని నారక్కపేటలో గురువారం నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం సమావేశంలో మాట్లాడారు. సంక్షేమ బోర్డులో వేల కోట్లాది రూపాయలున్నా కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదని విమర్శించారు. పథకాల అమలును ప్రైవేట్, కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడితే కార్మికుల హక్కులు హరించబడతాయని చెప్పారు. కార్పొరేట్, ప్రైవేట్ సంస్థలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ప్రైవేట్, కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పాలన్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ మోసపూరిత, కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మెరుగు మల్లయ్య, చెన్నమల్ల మొగిలి, పెసరి కుమారస్వామి, కోడూరి రాజు, కుసుంబ రాజేందర్, కావటి శ్రీను, కృష్ణంరాజు, కొమ్మాలు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రదీప్, తదితరులు

బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధి కరువు

● బీఆర్ఎస్ యూత్ రాష్ట్ర నాయకుడు చిరంజీవి

నల్లబెల్లి : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి కరువైందని బీఆర్ఎస్ యూత్ రాష్ట్ర నాయకుడు పోగుల చిరంజీవి యాదవ్ విమర్శించారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కోర్టులను సాకుగా చూపుతూ బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవాలని చూస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. చట్టబద్ధమైన బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధి ఉంటే కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొచ్చి పార్లమెంటులో చట్టం చేయించాలని హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వ తొందరపాటు, నిర్లక్ష్యం వల్లే బీసీలకు న్యాయం జరగడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం తప్పదన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం మోసపూరిత విధానాలు మానుకుని పటిష్టమైన ప్రణాళికతో వ్యవహరించి రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు చంద్రశేఖర్, రాంబాబు, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

ఐనవోలు : మండలంలోని వనమాల కనపర్తికి చెందిన రిపిక ప్రేమ్‌కుమార్, ఎర్ల హరినాథ్, శ్రీనాథ్ గురువారం బీజేపీలో చేరారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముత్తిరెడ్డి కేశవరెడ్డి వారికి కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు ప్రణయ్, రాజు, రవితేజ, ఉపాధ్యక్షుడు ఆనందం, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ రాజేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'ఎన్నికల్లో మద్దతిస్తాం'



నర్సంపేట : స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతిస్తామని బహుజన రాజ్యాధికార పార్టీ (బీఆర్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌ను మంగళవారం కలిసి లేఖ అందజేసింది. కార్యక్రమంలో బీఆర్‌పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బుర్రి సాగర్, అంకేశ్వరపు రమేశ్, పుల్లెల్లా రమేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎడ్ల రవి, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాల సీఎస్ఈ (ఆర్టీఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్) సీనియర్ అధ్యక్షుడు గోరంతల విష్ణు ప్రసాద్ రచించిన 'ప్రోగ్రామింగ్ ఫర్ ప్రాబ్లమ్ స్వాలింగ్' పుస్తకాన్ని బిట్స్ కళాశాల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి గురువారం ఆవిష్కరించారు. అనంతరం విష్ణు ప్రసాద్‌ను అభినందించారు. ఈ సందర్భంగా విష్ణుప్రసాద్ మాట్లాడుతూ 21 ఏళ్ల బోధన అనుభవంతో ఇంజనీరింగ్‌లో మొదటి సంవత్సరం విద్యార్థులు సీ ప్రోగ్రామింగ్ అర్థం చేసుకోవడంలో పుస్తకం దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో బిట్స్ ప్రిన్సిపాల్ హరిహరన్, అకడమిక్ డీన్ డాక్టర్ నారాయణ, ఏఓ సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు పరామర్శ



నర్సంపేట : స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని ఆయన తల్లి కాంతమ్మ ఇటీవల మృతి చెందిన క్రమంలో పట్టణానికి చెందిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గురువారం పరామర్శించారు. తొలుత కాంతమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల సమాఖ్య అధ్యక్షుడు, వినియోగదారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు గిరగాని సుదర్శన్ గౌడ్, విజిలెన్స్ కమిటీ మెంబర్ నాగెల్లి సారంగం గౌడ్, ఏఎస్ఆర్ సంస్థ నిర్వాహకుడు ఎర్రబోయిన రాజశేఖర్, స్వయంకృషి సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్, ప్రతిభ సంస్థ ప్రతినిధి బోయిని వెంకటస్వామి, స్వేచ్ఛశ్రీ సంస్థ నిర్వాహకురాలు మైస వసంత, మెడికల్ స్టోర్స్ అసోసియేషన్ ప్రతినిధి రవికాంత్, తదితరులు పాల్గొన్నారు.

నివాళి



నర్సంపేట రూరల్ : మాజీ ఎమ్మెల్యే అర్శనపల్లి వెంకటేశ్వరరావుకు శ్రీరామ ధాన్య సంఘం పాలకవర్గ సభ్యుడు గోపు జయపాల్‌రెడ్డి గురువారం ఘనంగా నివాళులర్పించారు. నర్సంపేట మండలంలోని ముగ్దుంపురంలో వెంకటేశ్వరరావు 16వ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జయపాల్‌రెడ్డి హాజరై వెంకటేశ్వరరావు విగ్రహానికి పూలమాల వేసి ప్రసంగించారు. రైతు, మహిళా, పురుషుల పరస్పర సహాయక సహకార సంఘాలు స్థాపించారని తెలిపారు. సహకార చట్టం సాధనకు ఎనలేని కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు అర్శనపల్లి మాధవరావు, నామాల సత్యనారాయణ, సిద్ధి సుధాకర్, గుర్రం ఆదిరెడ్డి, చల్ల మల్లారెడ్డి, గోపీ, రత్నాకర్‌రెడ్డి, అర్శనపల్లి ప్రభాకర్‌రావు, మహిళా సంఘం అధ్యక్షురాలు రేణుక, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



పర్వతగిరి : మండలంలోని వడ్లకొండకు చెందిన గ్రామ పంచాయతీ వాటర్‌మెన్, ఎలక్ట్రీషియన్ వద్దే కుమారస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి మాజీ సర్పంచ్ ఆమడగాని రాజు యాదవ్ దాతల సహకారంతో సమకూర్చిన రూ.11,500 నగదును గురువారం అందజేశారు. తొలుత కుమారస్వామి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బైరి ఎల్లయ్య, దాడి సదానందం, చందసాని అశోక్, గుర్రాల సదానందం, శ్రీరాముల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.